నేడు, వైన్స్, బార్‌లు బంద్

కుత్బుల్లాపూర్: శ్రీరామనవమిని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో బుధవారం ఉదయం 6గంటల నుంచి ఈనెల 18వ తేదీ ఉదయం 6గంటల వరకు వైన్స్ దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని మేడ్చల్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ్ భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. 24 గంటల పాటు మద్యం అమ్మకాలను చేపట్టొద్దన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

ఎస్టీలకు పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం



నియామకం పత్రం అందజేస్తున్న హన్మంతరెడ్డి, శ్రీశైలంగౌడ్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా జతావత్ చందర్ నియమితులయ్యారు. ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ గణేష్ నాయక్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా మంగళవారం షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానన్నారు. ఎస్టీలకు ప్రభుత్వ పథకాలను అందేలా చర్యలు తీసుకుంటానని చందర్ పేర్కొన్నారు.

ఎన్‌టీఎస్‌ఓ-2లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి శ్రీచైతన్య విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఎన్‌టీఎస్‌ఓ-2లో ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన పేట్‌బషీరాబాద్ ఎస్సై రామనారాయణ, ఏజీఎం రమణారావులు మాట్లాడుతూ.. పట్టుదల, దీక్షతో చదవితే సాధ్యపడనిది ఏమీ లేదన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌజన్య, పాఠశాల అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా భరత్‌గౌడ్



జగద్గిరిగుట్ట: పార్లమెంట్ మల్కాజ్‌గిరి టీపీసీసీ ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా గడ్డమీది భరత్‌గౌడ్ నియమితులయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇంచార్జ్‌లను నియమిస్తూ ఉత్తర్వుల జారీ నేపథ్యంలో మంగళవారం ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ... వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

జోరుగా అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్: అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. చెరువులను ఆనుకుని ఉన్న స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గండిమైసమ్మ- దుండిగల్ మండల పరిధి దుండిగల్‌లోని సర్వే నెంబరు 871 పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న ప్రహరీని కూల్చి వేశారు. అదే విధంగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని సర్వే నెంబరు 332లో నిర్మిస్తున్న షెడ్డు, డి.పోచంపల్లిలోని ముల్లవని కుంటను కబ్జా చేసి నిర్మిస్తున్న ప్రహారీ గోడలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. మండల తహసీల్దార్ సయ్యద్ మతీన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి తన సిబ్బందితో కూల్చివేతలు చేపట్టారు. మరోసారి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రదీప్‌రెడ్డి తెలిపారు.

సీతారాముల కల్యాణానికి రావాలని మేయర్‌కు ఆహ్వానం

నిజాంపేట్: సీతారాములు ప్రపంచానికే ఆదర్శనీయులని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌కు చెందిన వెంకట్రాయనగర్ శ్రీరామనవమి ఉత్సవ కమిటీ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని కాలనీలో నిర్వహించే సీతారాముల కల్యాణంలో పాల్గొనాలని కోరుతూ మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మాణిక్‌రెడ్డి, వెంగయ్యచౌదరి, ఆవుల జగదీష్‌యాదవ్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వరూపారావు, రాజేష్ తదితరులు ఉన్నారు.

అఫిడవిట్‌లో తప్పులుంటే..

అభ్యర్థులకు తిప్పలే..!

రేపటి నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభం

- అన్ని కాలమ్స్ పూరించాల్సిందే..
- నేర సమాచారం తప్పనిసరిగా ఉండాలి
- ఆస్తులు, అప్పులు పక్కాగా ప్రస్తావించాలి
- అభ్యర్థుల వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్లు దాఖలు సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ కీలకంగా మారుతోంది. అభ్యర్థులు తమ వివరాలతో పాటు ఆస్తులు, అప్పుల గురించి ప్రమాణ పత్రం రూపంలో ముందే స్పష్టం చేయాల్సి ఉంటోంది. గతంలో ఏమైనా కేసులు ఉన్నా.. శిక్ష పడినా వాటిని పొందుపరచాలి. వీటిని కలిపి దాఖలు చేసే పత్రమే అఫిడవిట్. అందులో తప్పుడు సమాచారమిస్తే మాత్రం అదే ప్రత్యర్థులకు ఆయుధమై కోర్టు కేసుల వరకు వెళ్లడమే కాకుండా అనర్హత వేటుకు దారితీసే అవకాశం ఉంటుంది. గురువారం నుంచి పార్లమెంట్ సాధారణ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానుండటంతో అభ్యర్థులు నామినేషన్ దాఖలు సందర్భంగా సమర్పించే అఫిడవిట్‌లో తప్పులు లేకుండా చూసుకోవాల్సి బాధ్యత వారిపైనే ఉంటుంది.

వివరాలు తెలుసుకోవడం ఓటర్ల హక్కు

ప్రజాప్రతినిధిగా ఎన్నుకోబోయే అభ్యర్థి వివరాలను తెలుసుకోవడం ఓటర్ల హక్కు. అప్పుడే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తోంది. ఇదే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేస్తోంది. అందులో భాగంగానే అభ్యర్థులు తమ నామినేషన్‌తో పాటు అఫిడవిట్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలకు లోబడి ఫామ్-26 రూపంలో అభ్యర్థులు అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటోంది. ఇందులో అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, కేసుల సమాచారంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు తెలపాల్సి ఉంటుంది.

అన్నీ కాలమ్స్ పూరించాల్సిందే..

అఫిడవిట్‌లోని ఏ ఒక్క కాలమ్ ఖాళీగా వదలరాదని ఎన్నికల సంఘం(ఈసీ) స్పష్టం చేస్తోంది. అభ్యర్థులకు సంబంధం లేకపోతే ఆ కాలమ్‌లో 'నిల్ లేదా వర్తించదు' అని రాయాలని తెలిపింది. అభ్యర్థి సమర్పించిన అఫిడవిట్‌ను గమనించి ఏదైనా సమాచారం లేకపోతే ఆర్‌ఓ నోటీసు ఇస్తారు. అప్పుడు సవరించిన అఫిడవిట్‌ను అభ్యర్థి అందించాల్సి ఉంటోంది. అయినప్పటికీ పూర్తిస్థాయి వివరాలతో అఫిడవిట్ లేకపోతే పరిశీలన (స్క్రూట్నీ) సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురవుతోంది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను ఆర్‌ఓలు నోటీసు బోర్డు, వెబ్‌సైట్లో పొందుపరుస్తారు.

నేర సమాచారం తప్పనిసరి

క్రిమినల్ కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచాల్సి ఉంటోంది. ఏదైనా కేసులో న్యాయస్థానాలు గతంలో శిక్ష విధించినా, అప్పీల్‌కు వెళ్లినా వాటి సమాచారాన్ని ప్రస్తావించాల్సి ఉంటోంది. సామాజిక మాధ్యమాల ఖాతాలను తెలిపాల్సి ఉంటోంది. అన్ని వివరాలతో కూడిన అఫిడవిట్‌కు నోటరీ తప్పనిసరి. సాధారణంగా నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) ముందు అభ్యర్థి ప్రమాణం చేస్తారు. వేరే ఎవరైనా నామినేషన్ సమర్పిస్తే సదరు అభ్యర్థి తాను ఉన్న ప్రాంతంలోని మెజిస్ట్రేట్ ముందు ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అంతేగాకుండా అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను ప్రముఖ దినపత్రికల్లో స్పష్టంగా కనిపించేలా ప్రకటన ఇవ్వాల్సి ఉంటోంది.

ఆస్తులు, అప్పులను పక్కాగా ప్రస్తావించాల్సిందే..

స్థిర, చరాస్తుల వివరాలతో పాటు చేతిలో, బ్యాంకు ఖాతాల్లోని నగదు, డిపాజిట్లు, ఇతర సేవింగ్స్, బీమా పాలసీలు, అప్పులు తదితరాలు పొందుపర్చాల్సి ఉంటోంది. ఆభరణాలు, వాహనాలు, వ్యవసాయ భూములు, వాణిజ్య సముదాయాలు, నివాస స్థలాల వంటి వాటిని అఫిడవిట్లో ప్రస్తావించాలి. అవి వారసత్వంగా వచ్చాయా.. కొనుగోలు చేశారా అన్నది కూడా తెలపాల్సి ఉంటోంది. స్థిరాస్తులకు సంబంధించిన ప్రస్తుత మార్కెట్ విలువను పొందుపర్చాల్సి ఉంటోంది. అభ్యర్థితో పాటు కుటుంబ సభ్యుల పేరిట రుణాలు ఉంటే వాటి వివరాలనూ ప్రస్తావించాలి. కుటుంబ సభ్యుల ఆదాయ మార్గాలు, ప్రభుత్వం లేదా ప్రైవేటు కంపెనీల కాంట్రాక్టులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాల్సి ఉంటోంది. అభ్యర్థులు ఫామ్-26 ద్వారా అఫిడవిట్‌ను ఎన్నికల నిబంధనలకు లోబడి సమర్పించాల్సి ఉంటోంది. ఆస్తులు, అప్పులు, నేర వివరాలు కచ్చితత్వంతో ఉండాల్సి ఉంది. తప్పుడు సమాచారమిస్తే న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి ఉంటోంది.

కాంగ్రెస్ మాదిగలకు ఒక్క ఎంపీ సీటు ఇవ్వలేదు

- ఎమ్మార్పీఎస్ నేత కేశపాగ రామచంద్రమాదిగ
- అలాంటి పార్టీ వర్గీకరణ చేస్తుందంటే హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్య



రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

కుత్బుల్లాపూర్: మాదిగ కులస్తులకు తెలంగాణ రాష్ట్రంలో ఒక్క ఎంపీ స్థానాన్ని కేటాయించని కాంగ్రెస్ పార్టీ వర్గీకరణ చేస్తుందంటే హాస్యాస్పదంగా ఉందని ఎమ్మార్పీఎస్ నేత కేశపాగ రామచంద్రమాదిగ అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ నాయకులు అబద్ధాలాడుతూ మాదిగలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని అన్నారు. కేవలం మాదిగలంటే నామినేటెడ్ పోస్టులకు పరిమితం కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రాష్ట్రంలో ఒక్క లోక్‌సభ స్థానాన్ని కూడా మాదిగలకు కేటాయించలేదని విమర్శించారు.

◆ ఇక వర్గీకరణకు ఎలా సహకరిస్తారని ప్రశ్నించారు. వర్గీకరణకు పార్టీ కట్టుబడి ఉంటే జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో వాగ్దానం చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే రెడ్డి సామాజికవర్గ పార్టీగా మారిందన్నారు. బీసీలకు సైతం తీరని అన్యాయం జరుగుతోందన్నారు.

◆ ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకుడు తోకల చిరంజీవి, వంగ ప్రణయ్, వడ్డేపల్లి శివస్వామి, సిలివేరు శ్రీనివాస్, రాసమల్ల యాదగిరి, యువసేన ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్‌మాదిగ, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సలోమి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లే..

మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి విషయంలో నెంబర్ వన్‌గా ఉంటే నేడు కాంగ్రెస్ పాలనలో నీటి కటకటతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీలో కార్పొరేటర్ రావుల శేషగిరి అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి లక్ష్మారెడ్డితో పాటు ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా సమయంలో మల్కాజ్‌గిరి ప్రజలను ఏనాడూ రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. బీజేపీకి విజయాన్ని అందించడానికే ఈ ప్రాంతానికి సంబంధం లేని సునీతామహేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలిపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే బీజేపీ ఓటేసినట్లేనని విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశం

అప్రమత్తంగా ఉండాలంటున్న అగ్నిమాపక అధికారులు



మోడీ బిల్డర్స్‌లో అవగాహన కల్పిస్తున్న జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది

జీడిమెట్ల: ఇళ్లల్లో గ్యాస్ పైప్‌లైన్‌లను తరచూ సరి చూసుకోవడంతో పాటు మండే స్వాభావం కలిగిన ద్రావణాలన్ని నిలువ ఉండకుండా చూసుకోవాలని జీడిమెట్ల ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జీడిమెట్ల ఫైర్‌సిబ్బంది మంగళవారం ఎస్‌ఆర్‌నాయక్ నగర్‌లోని మోడీ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది ఇళ్లల్లో, ఇంటి చుట్టు పక్కల అగ్నిప్రమాదాలు జరిగినపుడు అనుసరించాల్సిన పద్ధతులను అపార్ట్‌మెంట్ వాసులకు చూపించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీ చుట్టు పక్కల పరిసరాల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే 101కు సమాచారం అందించాలని కోరారు.

ప్రాణప్రతిష్ఠాపనోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో పునర్ నిర్మించిన, కొత్తగా నిర్మించిన ఆలయాల్లో దేవతా మూర్తుల ప్రాణప్రతిష్ఠాపనోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. దీనికి సంబంధించి గణపతి సచ్చిదానందస్వామి ఐదు రోజుల ప్రతిష్ఠ కల్పాన్ని స్వీకరించారు. దత్తాత్రేయ అవతారాల్లో ఒకటైన యోగిరాజ దత్తాత్రేయ స్వామి ఆలయం, రాజరాజేశ్వరీ మహాదేవాలయం, హనుమాల్ ఆలయం, పాతాళ ఆంజనేయస్వామి దేవాలయం, శేషనాగ దేవాలయా, నవగ్రహ దేవాలయాలకు ప్రాణప్రతిష్ఠ, పునర్ కలశాభిషేకాలు జరుగుతున్నాయి.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, సంక్షేమ సంఘాల నేతలు పలు సమస్యలను విన్నవించారు. ఆయన నివాసంలో కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అదే విధంగా శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొనాలని పలు ఆలయాల కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వాహనాల దొంగల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు



రికవరీ చేసిన ల్యాప్‌ట్యాప్

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీసులు నాలుగు దొంగతనాల కేసుల్లో నలుగురి వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.విజయ్‌నాయక్ వివరాల ప్రకారం.. వివిధ దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసులు నమోదు నమోదు చేసి మంగళవారం రిమాండుకు తరలించారు.

ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దస్తగిరి..

షాపూర్‌నగర్‌కు చెందిన షేక్ దస్తగిరి(32) రాత్రిపూట ఇళ్లల్లో ల్యాప్‌ట్యాప్‌లు, ఫోన్‌ల దొంగతనాలకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవాం ఉదయం దస్తగిరిని అదుపులోకి తీసుకుని విచారించగా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

ద్విచక్రవాహనాల దొంగ గందేశ్రీ శివకుమార్..

జగద్గిరిగుట్టకు చెందిన గందెశ్రీ శివకుమార్(34) రోడ్లపై పార్క్‌చేసి ఉంచిన ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతుంటాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం రాత్రి నిందుతుడిని అదుపులోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసి అతని వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలను రికవరీ చేసి రిమాండుకు తరలించారు. ఇప్పటికే శివకుమార్ 30కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

ద్విచక్రవాహనం దొంగిలించిన సాయిలు..

రాంరెడ్డినగర్‌కు చెందిన పొన్న సాయిలు(34) జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఓ వ్యక్తి తన పల్సర్‌బైక్‌ను పార్కింగ్ చేసి తాళంచెవి అందులోనే మరిచిపోయాడు. ఇది గమనించిన పొన్నం సాయిలు పల్సర్‌బైక్‌ను తీసుకుని పారిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని నుండి పల్సర్ వాహనాన్ని రికవరీ చేసి రిమాండుకు తరలించారు.

పాన్‌షాపుల్లో, ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడిన అన్సారీ..

ఎర్రగడ్డకు చెందిన ఎండీ అన్సారీ(21) ఇతను పాత నేరస్తుడు అన్సారీ తాళంవేసి ఉన్న పాన్‌షాపుల్లో, ద్విచక్రవాహనాల దొంగతనాలు చేస్తుంటాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్సారీని సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని విచారించి అతని వద్ద నుంచి ఒక ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్, రూ.11వేలు రికవరీ చేసి రిమాండుకు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ హనుమంతారావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు అభినందించారు.

మల్కాజ్‌గిరి లోక్‌సభ..

కాంగ్రెస్‌కు కంచుకోట

కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఇక్కడ గెలవలేవని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల డివిజన్లలో వేర్వేరుగా సంక్షేమ, కుల సంఘాల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్లమెంట్ పరిధిలో ఏ ప్రాంతంలో పర్యటించినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సహకరిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించాలని కోరారు.

◆ అనంతరం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. మల్కాజ్‌గిరి సిట్టింగ్ స్థానాన్ని మరోసారి కైవసం చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో మెజార్టీ సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. అనంతరం బీజేపీ నాయకులు సునీత మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

◆ ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బండ్రు శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతిరెడ్డి, సాంతిరెడ్డి పున్నారెడ్డి, కందాడి జ్యోత్స్నారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పట్నం సునీతాకు స్వాగతం పలుకున్న మహిళలు

క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్-2024 ఘనంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన జట్లు పోటీ పడగా విజేతలుగా నిలిచిన జట్లకు మంగళవారం ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, అరుంధతి ఆస్పత్రి డైరెక్టర్ దీరస్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై విజేత జట్లకు బహుమతులు, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

మహిళ అదృశ్యం

సుభాష్‌నగర్: అనుమానాస్పదంగా ఓ మహిళ అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం న్యూశివాలయనగర్‌కు చెందిన క్రాంతికుమార్, ప్రగతి(24) లు భార్యాభర్తలు. కాగా ఈ నెల 12న భీమారంలోని ఓ ఆస్పత్రిలో పని నిమిత్తం ప్రగతిని సూరారం సాయిబాబా ఆలయం వద్ద క్రాంతికుమార్ బస్సు ఎక్కించాడు. అయితే 13వ తేదీన ఆమె సెల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన క్రాంతికుమార్‌కు ఆమె ఆచూకీ తెలియకపోవడంతో సూరారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.